

భక్తజనుల వాడా..గోవిందా!



వాడపల్లి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మండంగా సాగుతున్నాయి.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకుంటున్నారు.. నాలుగో రోజు సోమవారం రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు గోవిందా.. గోవింద అం టూ నామస్మరణ చేశారు. విద్యుత్‌కాంతుల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.

6

ఈజీగా సంపాదించాలని..
మోసపోయాడు!
రూ.74 లక్షలు కొట్టేసిన వైనం

కృష్ణంపాలెంలో
కాలేజ్ బస్‌ను ఢీకొన్న బొలెరో
డ్రైవర్, విద్యార్థులకు గాయాలు

7

కుమ్మేసిన వాన

రాజమహేంద్రవరం సిటీ/ కొవ్వూరు/ నల్లజర్ల , అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు వర్షం భారీగా కురిసింది. జిల్లాలో అత్యధికంగా 48.0 మీమీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గోకవరంలో 0.2 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో సగటున 13.5 శాతం వర్షం పడింది.రాజమహేంద్రవరంలో 30.2 మి.మీ , రాజానగరంలో 28.2, రంగంపేటలో 26.8, గోపాలపురంలో 12.8, రాజమహేంద్రవరం రూరల్‌లో 12.4, తాళ్ళపూడిలో 11.2, నిడదవోలులో 11.0, చాగల్లులో 10.8, సీతానగరంలో 10.4, పెరవలిలో 9.4 , దేవరపల్లిలో 9.2 , బిక్కవోలులో 8.8, కడియంలో 8.4, కొవ్వూరులో 6.2, ఉండ్రాజవరంలో 6.0 , అనపర్తిలో 3.8, కోరుకొండలో 3.2 మి.మీల వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది. రాజమహేంద్రవరం, రాజానగరం, రంగంపేట మండలాల్లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో సోమవారం ఉదయం సుమారు గంటసేపు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ముంపునకు గురయ్యాయి. ఉదయం పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు పడారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయం, పట్టణ పోలీస్‌స్టేషన్, కోర్టు ప్రాంగణాలకు వెళ్లే రోడ్డుపై వర్షపునీరు నిలిచి ప్రజలు, కక్షిదారులు అవస్థలు పడ్డారు. నల్లజర్ల చెక్కుపోస్టు వద్ద వరద నీరు భారీగా చేరి రాకపోకలకు అంతరాయం కలిగించాయి. బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కాలువ కాదు సుమా : రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన వాన నీటిలో వాహనాలు



దారేది : నల్లజర్లలో జాతీయ రహదారిపై వాన నీటి ప్రవాహం



రాజమహేంద్రవరంలో ఇలా

అవినీటి.. ఆవ!



వ్యర్థాలతో నిండిన ఆవ ఛానల్

మురుగంతా చేరేది ఆవకే..

నగరపాలక సంస్థలో 60 మిలియన్ లీటర్ల (60 ఎంఎల్‌డీ) మురుగునీరు లభ్యమవుతోంది.చెత్త రోజుకు 160 టన్నులు వస్తుంది. చెత్త కొంత వరకూ లూధర్‌గిరిలోని క్వారీగొయ్యిలో వేస్తున్న సంగతి తెలిసిందే. కోరుకొండ రోడ్డు, లలితా నగర్ వాటి ఎగువ ప్రాంతాల నుంచి మురుగంతా నల్లా ఛానల్ ద్వారా గోదావరిలోకి పంప్ చేస్తారు. ఇక లాలా చెరువు వైపు నుంచి ఆర్ట్స్ కాలేజీ మీదుగా వచ్చే మురుగు కంబాల చెరువులోకి చేరుతోంది. అక్కడ నుంచి ఆవ చానల్‌కు పంప్ చేస్తారు. మెయిన్ మార్కెట్, ఏవీ అప్పారావు రోడ్డు, హుకుంపేట, బాలాజీపేట తదితర ప్రాంతాల మురుగంతా ఆవచానల్‌కే వస్తుంది. కార్పొరేషన్‌లోని ఎక్కువ మురుగునీటిని షెల్టాన్ హో టల్ ప్రాంతంలోని ఆవ చానల్లోకి పంప్ చేస్తున్నారు. కొంత సహజంగా చేరుతోంది.

మురుగునీటి శుద్ధి పేరుతో కోట్లు వృథా

- కాంట్రాక్టర్లు,అధికారులు మింగుడే
- ఎస్‌టీపీకి ఏడాదికి రూ.50 లక్షలు
- అక్కడ శుద్ధి చేసేది తక్కువ..
- ఆ నీరు మళ్లీ ఆవ చానల్‌కే
- ఆ మురుగు గోదావరిలోకే
- అవుట్‌లెట్ లేకుండా శుద్ధి?
- మరో రెండు ఎస్‌టీపీలు రెడీ

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)
రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో మురుగునీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రూ.కోట్లు వృథా అవుతున్నాయి. శుద్ధిచేసిన మురుగునీటికి అవుట్‌లెట్ లేకపోవడం రూ.కోట్ల అవినీతికి అవుట్‌లెట్‌గా మారింది. ఎస్‌టీపీ నుంచి ధవళేశ్వరం సాయిబాబా గుడి వరకూ సుమారు 5.5 కిలోమీటర్ల మేర ఈ ఆవ ఛానల్ ఉంది.ఎస్‌టీపీ నీటిని దీనిలోకి వదిలేస్తున్నామని చెబుతున్నారు. కానీ చానల్ అంతా పూడుపోయింది. పైగా హుకుంపేట, వీఎల్ పురం, బాలాజీపేట నుంచి వచ్చే మురుగునీరంతా ఈ చానల్ గుండా ధవళేశ్వరం సాయిబాబా గుడి సమీపం నుంచి గోదావరిలో కలుస్తోంది. ఇందులో శుద్ధిచేసిన నీరు ఉందని చెబుతున్నారు. కానీ ఉపయోగం ఏముంది. చివరకు గోదావరిలో మురుగునీరే కలుస్తుంది. పైగా ఆవ ప్రాంతమంతా మురుగునీరు పేరుకుపోవడం గమనార్హం. ఈ మురుగునీటి ప్రవాహానికి సరైన అవుట్‌లెట్ లేకుండా ఎంత చేసినా అది దోపిడీనే. ప్రజాధనాన్ని వృథా చేయడమే.



ఏడాదికి రూ.50 లక్షలు వృథా

ఆవలో ప్రస్తుతం పనిచేస్తున్నట్టు చెబుతున్న 30 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంట్‌కు ఏడాదికి రూ. 50 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇదంతా ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేస్తున్నాయి. వాస్తవానికి ఇక్కడ శుద్ధి చేసిన నీరు సద్వినియోగమైతే ఈ ప్లాంట్ నిర్వహణకు ఎంత ఖర్చు చేసినా తప్పుండదు. కానీ ఆవ నుంచి వచ్చిన మురుగునీరు రోజుకు 30 మిలియన్ లీటర్ల నీటిని ఇక్కడ శుద్ధి చేస్తున్నట్టు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి అలా లేదు. ఇక్కడ ఆవ చానల్ పూర్తిగా పూడుపోయింది. ఇదంతా అవినీతికి అవుట్‌లెట్టే. ఆవ చానల్ నీటినంతా శుద్ధి చేస్తు న్నట్టు చెబుతుంటారు. కానీ చిన్న చానల్ ద్వారా కొంత నీరు మాత్రమే ఎస్‌టీపీకి వెళుతుంది. మిగతా నీరంతా ఆవ ఛానల్ నుంచే ముందుకు పోతోంది.

ఎస్‌టీపీలు నిర్మాణం..

ఆవ చానల్ నుంచి వచ్చిన నీటిని శుద్ధి చేయడానికి వాంబే గృహాలకు కూత వేటు దూరంలో గతంలోనే 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మించారు. ఇక్కడే 55 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణంలో ఉంది. దాని పక్కనే అమృత పథకం కింద 5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణంలో ఉంది. ఇవి ఫిబ్రవరికి పూర్తి కావొచ్చని అధికారులు చెబుతున్నారు. కొత్తవి పూర్తయితే మొత్తం 90 ఎంఎల్‌డీ డ్రైనేజీ వాటర్‌ను శుద్ధి చేయవచ్చు. కానీ ఈ నీటిని బయటకు పంపడానికి సరైన అవుట్‌లెట్ లేదు. ఆవ చానల్ నిర్మించి అక్కడ నుంచి ధవళేశ్వరం దిగువన గోదావరిలో ఈ మురుగు కలిపే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ధవళేశ్వరం వద్ద ఓ చిన్న ఎస్‌టీపీని నిర్మించడానికి ఇరిగేషన్ అధికారులు మోకాలడ్డుతున్నారు.

మెకానికల్ స్క్రీనింగ్ రూ.1.10 కోట్లు

ఎస్‌టీపీకి ముందు ఈచానల్ మీద రూ.కోటి 10 లక్షలతో మెకానికల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు.వైసీపీ హయాంలో ఇదో కాంట్రాక్టర్‌కు అప్పగించారు.ఇది కూడా మరో అవినీతి బాగోతం ఉంది.ఈ స్క్రీన్ ఆవ చానల్ నుంచి వచ్చిన చెత్తనే తీసి గట్టుమీద వేస్తుంది. మురుగునీరు ముందుకు పోతుంది. అందులో నుంచి కొంత మురుగునీటిని ఎస్‌టీపీకి ఉపయోగిస్తారు. కానీ రోజుకు కొద్దిగా చెత్తను మాత్రమే తీస్తారు. ఎండిన తర్వాత డంపింగ్ చేస్తున్నారు.

ఇంకేం ఉపయోగం?

కార్పొరేషన్‌లో పెద్ద ఎత్తున పారిశుధ్య వ్య వస్థ ఉంది.అయినా ఆవ ఛానల్ చెత్తతో నిం డిపోతుంది.వాస్తవానికి కంబాలచెరువులో మురుగునీటిని తోడడానికి ఓ పంపు హౌస్ ఉంది. ఇక్కడ నెలకు రూ.1.5 లక్షల ఖర్చవుతుంది. కేవలం మురుగునీటిని ఎత్తిపోయ డానికే ఇంత ఖర్చవుతోంది. ఏటీ నాగేశ్వరరావు పార్కు సమీపంలో మరో పంపింగ్ హౌస్ ఉంది. మెకానికల్ స్క్రీన్ ఉంది.ఇక్కడ నెలకు రూ.60 వేల వరకూ ఖర్చవుతుంది.ఇంత జరిగినా ఇక్కడి మురుగునీరు ఆవ చానల్‌లోకి వెళ్లేసరికి టన్ను ల కొద్దీ చెత్త పేరుకుపోతుంది.

ఇలా చేస్తే బెటర్?

ఆవ ఛానల్ క్లియర్ చేయాలి. ఆక్రమణలు తొలగించి,వేగంగా మురుగు ప్రవహించేడ్రైన్‌గా రూపొందిస్తే చాలా వరకూ సమస్య తీరుతోంది. కొత్త ఎస్‌టీపీలు ఫిబ్రవరిలో పూర్తి చేసినా, శుద్ధిచేసిన నీటిని ఎక్కడకు పంపి స్తారు. మొక్కలు,బస్టాండ్; రైల్వే స్టేషన్లలో వినియోగానికి (తాగునీటికి కాదు) ఉపయోగిస్తామనే ప్రతిపాదన ఉంది. అవన్నీ సిద్ధం చేసి ఒక స్పష్టమైన ప్రణాళికతో పనులు చేస్తేనే ఈ ఎస్‌టీపీల ఉపయోగం..లేకపోతే నిర్వహణ పేరిట రూ.కోట్లు దోపిడీయే అవుతుంది.



పంచాయతీలకో గ్రేడ్

- జిల్లాలో 299 పంచాయతీలు
- స్పెషల్ గ్రేడ్ 26, గ్రేడ్-1 134
- గ్రేడ్-2లో 79, గ్రేడ్-3 60
- ఇక పీడీవోలుగా సెక్రటరీలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
గ్రామ పంచాయతీల విధానాన్ని ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. ప్రతీ గ్రామం ఒక పంచాయతీగా ఉంటుంది. గతంలో రెండు మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా పిలిచేవారు.ఇక ఏ పంచాయతీకి ఆ పంచాయతీనే ప్రత్యేక గుర్తింపుతో ఉంటుంది. అంతేగాక పంచాయతీ సెక్రటరీలను ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)లుగా మార్చారు. పంచాయతీల జనాభా, ఆదాయాన్ని అనుసరించి నాలుగు కేటగిరీలుగా విభజించారు. పెద్ద పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (రూర్బన్ పంచాయతీ) లుగా మార్చి, తర్వాత ఆదాయాన్ని జనాభాను బట్టి గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా వర్గీకరించారు. చాలా కాలం తర్వాత జరిగిన ఈ ప్రక్షాళనకు ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా అందులో 26 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ (రూర్బన్) పంచాయతీలుగా గుర్తించారు. వీటికి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారి ఉంటారు.ఇక్కడ కూడా ప్రణాళిక, ఇంజనీరింగ్, వాటర్ సప్లయి, శానిటేషన్, రెవెన్యూ వంటి విభాగాలు ఉంటాయి. అందుకే వీటిని రూర్బన్ పంచాయతీలు అంటారు. వాస్తవానికి జిల్లాలో రాజమహేంద్రవరం డివిజన్ నుంచి జిల్లా యంత్రాంగం 20 పంచాయతీలు స్పెషల్ గ్రేడ్, 42 గ్రేడ్-1, 64 గ్రేడ్-2, 21 గ్రేడ్-3గా ప్రతిపాదించారు. డివిజన్‌లో మొత్తం 246 పంచాయతీలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్‌లో 11 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు, 48 గ్రేడ్-1, 55 గ్రేడ్-2, 39 గ్రేడ్ -3గానూ గుర్తించి ప్రతిపాదించారు.ఈ డివిజన్‌లో మొత్తం 153 పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 31, గ్రేడ్-1 - 89, గ్రేడ్-2 -119, గ్రేడ్-3 -60 పంచాయతీలు విభజించి ప్రభుత్వానికి పంపారు.అక్కడ పరిశీలించి కొద్దిగా మార్పులు చేశారు. అందులో స్పెషల్ గ్రేడ్ 26,గ్రేడ్-1 134, గ్రేడ్-2 79, గ్రేడ్-3 60 ఉంచారు.వీటిని అధికారికంగా ధ్రువీకరిస్తూ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అప్పుడే ఏ పంచాయతీ ఏ కేటగిరీలో ఉందో స్ప ష్టమవుతోంది.త్వరలోనే ఉత్తర్వులు రానున్నాయి.

జవాబుదారీతనం కలిగి ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 137 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ కీర్తి, జేసీ

ఎస్పీ గ్రీవెన్స్‌కి 30 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 30 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించి వారి సమస్యలపై ఆరా తీశారు. చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఫ్యాక్టరీల్లో భద్రత ప్రమాణాలు తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పారిశ్రామిక భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో 9 కేటగిరీ ఏ, 13 కేటగిరీ బీ, 13 కేటగిరీ బీ2లో పెద్ద ప్రమాదాల సంభావ్యత ఉన్న కర్మాగారాలు ఉన్నాయన్నారు. ప్రతి ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రత అధికారిని నియమించాలన్నారు. అత్యవసర అలారం సజావుగా పని చేయాలన్నారు. భద్రతా చర్యలపై ప్రతి కర్మాగార యాజమాన్యం 45 రోజుల్లో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎవరూ హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ మేఘస్వరూప్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఆర్డీవో కృష్ణనాయక్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వేణుగోపాలకృష్ణ తదితరులు

వైసీపీ నాయకుల ధర్నా

రాజమహేంద్రవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో మద్యం విక్రయాలు ఎలా సాగాయో, జే బ్రాండ్లను ఎలా అమ్మారో, కనీసం డిజిటల్ లావాదేవీలు లేకుండా అమ్మకాలు చేసి రూ.కోట్లు దోచుకున్న వైసీపీ స్కామ్ బయటపడి, ఒక్కోనేత జైలు పాలవుతున్నారు.ఈ నేపథ్యంలో ఎక్కడో ఒకచోట దొరికిన నకిలీ మద్యం పేరు చెప్పి వైసీపీ ఆందోళనలు చేయడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. నకిలీ మద్యంతో పట్టుపడిన నేతలను కూటమి ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.దీనిని రాజకీయం చేస్తూ వైసీపీ సోమవారం జిల్లాలో ఎక్సయిజ్ కార్యాలయాల వద్ద ధర్నా చేసింది.కలెక్టరేట్ వద్ద వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, రాజమండ్రి ఎక్సయిజ్ ఈఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎంపీ మార్గాని భరత్ వేర్వేరుగా ఆందోళనలు చేశారు. రంగంపేట స్టేషన్ వద్ద అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, దేవరపల్లిలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, కొవ్వూరులో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

17 నుంచి ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 221 కేంద్రాలు ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. ఈ నెల 17 నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి,జేసీ వై.మేఘస్వరూప్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఖరీఫ్ ధాన్యం సేకరణ, కొనుగోలు విధానంపై కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఏ రైతు కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్మాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని జేసీ తెలిపారు.ఈ పంట నమోదు చేసుకున్న రైతుల నుండి మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరుగు తుందన్నారు. ప్రభుత్వం జమ చేసే మొత్తం అంతా నేరుగా రైతుల ఖాతాకు జమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సీతారామమూర్తి, డీఎస్‌వో వి.పార్వతి,మేనేజరు బి.గణేష్ కుమార్ పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లి సొసైటీ ఉద్యోగి భారతి సస్పెన్షన్

సీతానగరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) వెదుళ్ళపల్లి సొసైటీలో జరిగిన రూ 1.34 కోట్లు అవినీతిలో 32 మంది బాధిత రైతులకు ఊరట లభించింది. సొసైటీ సీఈవో శివ రామకుమారి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కృష్ణమోహన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు. సభ్యులు అడిన ప్రశ్నలకు కృష్ణమోహన్ స్పందిస్తూ రేషన్ సరుకుల్లో సంఘానికి రావాల్సిన కమీషన్ రూ.3,27,236లు, ఎరువుల్లో రూ.8,29, 398లు అదనంగా అవినీతి బయటపడిందన్నారు.మొత్తం రూ.1,34,41,272లో ఇంత వరకు రూ. 58,15, 272 రికవరి కాగా ఇంకా 76,26,000/-లు రికవరి కావలసి ఉందన్నారు.విచారణ పూర్తయినందున ఆర్డర్స్ రాగానే రైతుల రుణాలకు క్లియరెన్స్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. సొసైటీలో పనిచేస్తున్న సబ్‌స్టాఫ్ భారతిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుటూరి విశ్వనాధం, పెందుర్తిరాజా, పెందుర్తి బుజ్జయ్య చౌదరి రైతులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో
సంప్రోక్షణ ప్రారంభం

వర్షాల కారణంగా నిలిచిన
పాపికొండల పర్యాటకం

సామర్లకోట
చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

7

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



జననం: 20-12-1951
మరణం: 04-10-2025

కీ॥శే॥ అడపా అప్పారావు గారు
సీనియర్ జర్నలిస్ట్
రోళ్ళపాలెం, అమలాపురం మండలం

ప్రేమ అప్యాయతలు మాకు పంచియిచ్చి, మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసి, మీరు ఎంచుకున్న వృత్తిలో ఐదు దశాబ్దాలుగా వుంటూ... విలువలుతో కూడిన జర్నలిజంలో ప్రజల సమస్యలపై భాగస్వామిగా నిలిచి... వాటి పరిష్కారానికి నడుంబిగించి అందరి హృదయాలలో చెరగని ముద్రవేసుకొన్న, ఆదర్శమూర్తి సీనియర్ జర్నలిస్ట్ శ్రీ అడపా అప్పారావు గారి ఆకస్మిక మృతికిచింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: సరస్వతి
కుమార్తె: రేకపల్లి తేజస్విని అల్లుడు: చెన్నకేశవ జగదీశ్వర్
మనుమరాలు: చిన్మయి శ్రీసూర్యఅపర్ణ
వియ్యంకుడు: రేకపల్లి రాంబాబు వియ్యపురాలు: రత్నకుమారి
అడపా వీరస్వామి - సత్తెమ్మ, రేకపల్లి నాగభూషణం - సూర్యకాంతం, కుటుంబ సభ్యులు

పెద్దకార్యం:
ది.15-10-2025 బుధవారం రోళ్ళపాలెం భట్నవిల్లి-పేరూరు వై జంక్షన్ NH-216 జాతీయ రహదారి ప్రక్కన మా స్వగృహమునందు జరుగును.




స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మహా స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న దృశ్యం

యోగ నారసింహుడై... సింహవాహనారూఢుడై



- వాడపల్లిలో శాస్త్రోక్తంగా మహా స్నపనం
- శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి జగత్ కల్యాణం
- నాలుగో రోజుకు శ్రీవారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- గోవిందనామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల

ఆత్రేయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, మహా స్నపనం, ప్రధాన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలను చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు సమర్పించారు.

సాయంత్రం స్వస్తి వాచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాటం, కర్రసాము ప్రదర్శనలు భక్తులను ఊర్రుతలూగించాయి. రాత్రి యోగనారసింహ



అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహం పొందారు.




స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్, ఉప కమిషనరు దంపతులు... వేంకటేశ్వరస్వామి, దేవేరుల అలంకరణల్లో కళాకారులు




ఆకట్టుకున్న మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన



అందాల కొండ... మేఘాలు నిండా...

ఉదయం, సాయంత్రం వేళల్లో పొగ మంచు... అప్పుడప్పుడు చిరుజల్లులు... మన్యంలో ఇలా భిన్నమైన వాతావరణం మనసుకు హాయి గొలుపుతుంది. పచ్చని పొలాలు ఒకవైపు... కొండలపై నుంచి మేఘాలు తేలియాడుతున్నట్టు మరోవైపు... ఇలా మంచు సోయగాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి చిక్కిన మంచు మనోహర దృశ్యమిది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)



ప్రతిభాన్వేషణ

కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు-2025 షెడ్యూల్ విడుదల

అమలాపురం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభా పాటవాలు, సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు దోహదపడతాయి. భారతీయ విజ్ఞాన మండలి, అప్‌కాస్ట్ సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు-2025 షెడ్యూల్‌ను విడుదల చేశారు. నవంబరు 1 నుంచి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాలుగు విభాగాలుగా జరిగే పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

పాఠశాల స్థాయి పరీక్షలు ఇలా...

పాఠశాల స్థాయిలో క్విజ్ పోటీలను 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారు. వారిలో ఒక్కో తరగతికి ముగ్గురు విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయాలి. రీల్ పోటీలకు పదో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. పోస్టర్ కాంపిటీషన్-1 పోటీలను 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేయాలి. పోస్టర్ కాంపిటీషన్-2 పోటీలను 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేయాలి. క్విజ్, రీల్ కాంపిటీషన్, పోస్టర్ కాంపిటీషన్‌లో పాల్గొనే విద్యార్థులకు స్కూల్ లెవెల్‌లోనే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. క్విజ్ పోటీలకు ఎస్‌సీఈఆర్టీ సిలబస్ అక్టోబరు వరకు ఉంటుంది. రీల్ పోటీలకు ఇండియన్ కాం



ట్రిబ్యూషన్ టు సైన్స్ వెబ్‌సైట్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలకు భారత దర్శన్ మెటీరియల్ వినియోగించుకోవాలి. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలో ప్రతి తరగతి నుంచి క్విజ్‌కు 20 మంది, రీల్‌కు 20 మంది, పోస్టర్-1కు 20 మంది, పోస్టర్-2కు 20 మంది చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఫైనల్‌గా ఎంపిక చేస్తారు. నవంబరు 1, 3, 4 తేదీల్లో స్కూల్ లెవెల్ పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలోను ఆన్‌లైన్ పరీక్ష...

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షనిర్వహిస్తారు. వారిలో రాష్ట్ర స్థాయికి ప్రతి జిల్లా నుంచి క్విజ్ పోటీలకు 8, 9, 10 తరగతుల నుంచి ఇద్దరేసి విద్యార్థులు పాల్గొంటారు. రీల్ కాంపిటీషన్‌కు పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-1కు 9వ తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-2 కు 8వ తరగతి విద్యార్థులు ఇద్దరు ఎంపికవుతారు. ఇలా ప్రతి జిల్లా నుంచి విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. 8, 9 తరగతుల విద్యార్థులకు నవంబరు 27న, పదో తరగతి విద్యార్థులకు నవంబరు 28న పరీక్షలు జరుగుతాయి.

రాష్ట్ర స్థాయిలో ముఖాముఖి పోటీలు

ఎం.సూర్యనారాయణ, జిల్లా స్థాయి పరీక్షల నిర్వహణాధికారి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆయా విభాగాల్లో ముఖాముఖి పోటీలు నిర్వహిస్తారు. డిసెంబరు 27న తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన జాతీయ సమ్మేళనంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ.4,500, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతి రూ.9వేలతో పాటు రూ.6వేలు చొప్పున కన్సొలేషన్ బహుమతులను ఆయా విభాగాల్లో అందజేస్తారు. అర్హులైన విద్యార్థులంతా కౌశల్ పోటీల్లో పాల్గొనాలి.



జాతీయ క్రీడా పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన అంబాజీపేట విద్యార్థులు

అంబాజీపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ నెల10 నుంచి 12వరకు బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో 20కిలోల విభాగంలో కుడుపూడి కావ్య సుందరి హరిప్రియ ప్రథమ, 24 కిలోల విభాగంలో యెరుబండి ఇషానాగశ్రీనిజ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ త్రిమూర్తులు తెలిపారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు నీలిమ

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల నిర్వహించిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముమ్మిడివరం శ్రీబాలాజీ కాన్వెంట్‌లో పదో తరగతి చదువుతున్న యనమదల నీలిమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబరు 7,9తేదీల్లో జరిగే జాతీయ పోటీల్లో ఆమె పాల్గొనున్నట్టు హెచ్‌ఎం పీవీ రామరాజు తెలిపారు. నీలిమను కాన్వెంట్ కరస్పాండెంట్ పి.సుజాత, వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీఎస్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.



నీలిమను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తేజశ్రీ ఎంపిక



బిక్కవోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన పి.తేజశ్రీ అండర్-19 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యిందని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్‌క్లబ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 బాలికల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం చెప్పారు. ఈ సందర్భంగా తేజశ్రీని, తర్ఫీదు నిచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండోలో రాష్ట్రస్థాయికి శశిరేఖ

రాజోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాటిపాక వేద జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న యెరుబండి లక్ష్మీశశిరేఖ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని వేద విద్యా సంస్థల సెక్రటరీ ఏవీఎస్ఎస్ రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాపన్న లక్ష్మీశశిరేఖకు శాలువా కప్పి సన్మానించారు. లక్ష్మీశశిరేఖను సెక్రటరీ రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమేశ్వరరావు, ఏవో రామరాజు, నాన్ అడకమిక్ డైరెక్టర్ కంచి సూర్యనారాయణ అభినందించారు.



శశిరేఖను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రేపటి నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయూజీకేవై సెంటర్‌లో బుధవారం నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వికాస పీడీ కె.లచ్చారావు వెల్లడించారు. ఈ శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు.శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీ మెటీరియల్ అందిస్తారన్నారు. ఈ కోర్సుతో పాటు బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్,ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నెంబర్లు 83284 83297, 89784 75164లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న జస్టిస్ రమణ దంపతులు

సామర్లకోట/పిఠాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సతీసమేతంగా సోమవారం రాత్రి సామర్లకోట కుమారరామ భీమే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆలయానికి చేరుకున్న ఎన్‌వీ రమణ దంప తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించిన రమణ దంపతులు ముందుగా భీమేశ్వరునికి, బాలాత్రిపుర సుందరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. పండితులు వేదాశీర్వాదంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా వారి వెంట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సునీత గంధం, కాకినాడ జిల్లా నాలుగో జూనియర్ జడ్జి నిరుపభాంజ్, డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు, సీఐ కృష్ణభగవాన్ తదితర ఆలయాధికారులు పాల్గొన్నారు. అలాగే జస్టిస్ ఎన్‌వీ రమణ దంపతులు పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీని వాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

18 మంది యాచకులకు నేర చరిత్ర: ఎస్పీ



యాచకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18 మంది యాచకులకు నేర చరిత్ర ఉన్నట్టు గుర్తించామని.. తగు దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్పీ నర సింహ కిషోర్ పేర్కొన్నారు. కొంతమంది యాచకులు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడంతోపాటు నేరాలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రానున్న పుష్కరాల దృష్ట్యా ఆదివారం రాత్రి ప్రత్యేక సోదాలు చేశామన్నారు. దీంట్లో 193 మందిని గుర్తించామని, వారిలో 18 మందికి నేర చరిత్ర ఉందన్నారు. మిగతా వాళ్లను కౌన్సెలింగ్ చేసి స్వగ్రామాలను పంపించామని చెప్పారు. ఈ డ్రైవ్‌ని కొనసాగిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కె రాంప్.. వినోదాత్మక చిత్రం హీరో కిరణ్ అబ్బవరం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో కిరణ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్ని హంగులున్న వినోదాత్మక చిత్రం కె రాంప్ అని ఆ సినిమా హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన స్థానిక హోటల్ షెల్టాన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 18న దీపావళి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా కె రాంప్ సినిమా విడుదలఅవుతుందన్నారు. హాస్య మూవీస్ పతాకంపై జైన్స్ నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన కె రాంప్ సినిమా ఆద్యంతం స్పీడుగా నడుస్తుందన్నారు.ఈ సిని మా టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సినిమాలో యుక్తి తరేజా, నరేష్, సాయికుమార్, ఆలీ, వెన్నెల కిషోర్, అజయ్ అనన్య తదితరులు నటించిన కె రాంప్ సినిమా మాస్ కామెడీ ఎంటర్ టైనర్‌గా అన్ని వర్గాలను ఆకట్టుకుటుందని కిరణ్ అన్నారు. బాలయ్య సాంగ్‌తో ఎంట్రీ ఉంటుందన్నారు. పండగ సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా వీక్షించాలనుకునే వాళ్లు కచ్చితంగా ఈ సినిమాకు వస్తారనే నమ్మకం ఉందన్నారు. సినిమాటో గ్రఫీ సతీష్ రెడ్డి, ఎడిటర్ చోటా కె.ప్రసాద్, సంగీతం చైతన్ భరద్వాజ్‌లు సినిమాకి మంచి రెస్పాన్స్ తెచ్చారని చెప్పారు. భవిష్యత్తులో తనకు ఘటోత్కచుడు వంటి పాత్రలతో సినిమాలు చేయాలని ఉందని కిరణ్ అన్నారు.

జయలక్ష్మి బ్యాంకు బాధితులను ఆదుకోవాలి

కలెక్టరేట్‌లో నిరసన.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్



కలెక్టరేట్‌లో నిరసన చేపట్టిన బ్యాంకు బాధితులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు బాధితులను ఆదుకోవాలని కాకినాడ కలెక్టరేట్‌లో బాధితులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు ఈరంకి రఘుభూషణ్ మాట్లాడుతూ జయలక్ష్మి బ్యాంకు కుంభకోణంలో రూ.600 కోట్లు మాయం చేశారన్నారు. దీని వల్ల 19 వేల మంది బాధితులు రోడ్డున పడ్డారన్నారు.ఇప్పటి వరకు 90మంది బాధితులు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతిచెందారని ఆవేదన వ్యక్తంచేశారు. పైగా ఇప్పుడు జయలక్ష్మి ప్రస్తుత బోర్డు త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో కూడా రూ.3.77 కోట్లు బాధితుల సొమ్ము దుర్వినియోగమైందని ఆరోపించారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్డును రద్దు చేసి కొత్తబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈనేపథ్యంలో సెక్షన్ 29 ప్రకారం బోర్డు డైరెక్టర్లపై విచారణకు ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారన్నారు.అలాగే రాజమహేంద్రవరం నుంచి 50 సంతకాలతో ఇచ్చిన అవిశ్వాస తీర్మానం అందిన మరో 25 రోజుల్లో ప్రత్యేక సర్వజన మహాసభ పెడతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బాధితులు బదరి నారాయణ, కస్తూరి రవికుమార్, వీఎస్‌వీ సుబ్బారావు, ప్రభాకర్‌రావు, బేగం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



సంస్థ ప్రతినిధుల నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కాకినాడ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాలికట్‌లోని నిట్ సంస్థ ఈ ఏడాది నిర్వహించిన ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని గంగరాజునగర్ ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ జె.మొయినా తెలిపారు.పదో తరగతి విద్యార్థులు ఎంజే సమర్థ,ఎం.సాయి అభినవ్ రూ.25వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో నిట్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.దీపక్‌రెడ్డి అభినందించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

నీట మునిగిన పత్తి పంట
రంగు మారుతుందని రైతుల్లో ఆందోళన



రాయనపేటలో పత్తితోటలో నిలిచిన వరదనీరు

ఎటపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఎటపాక ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ప్రస్తుత పంటలకు కొంత ఖేదం... కొంత మోదంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే సాగైన వరి, మిర్చి పంటలకు వర్షం మేలు చేసినప్పటికీ, మరోవైపు చేతికొచ్చిన పత్తిపంట కొంత మేర దెబ్బతిననుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎటపాక మండలంలో 5,324 ఎకరాల్లో పత్తి పంట, 3,124 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. మొన్నటి వరకు పలు పర్యాయాలు వచ్చిన గోదావరి వరదల ధాటికి మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి.కాస్త పత్తి పంట బాగుందని భావించారు. ఇప్పటికే కాయ పగిలి పత్తిపంట చేతికొచ్చే దశలో ఉంది. వర్షం వల్ల కాయరంగు మారి, పంటమీద ఉన్న పత్తి రంగు మారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా వర్షం ధాటికిపత్తి తోటల్లో వరదనీరు నిలిచింది.దీంతో కొందరు రైతులు నీటిని బయటకు మళ్లించారు.

ముంచిన వాన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమై చిన్నపాటి చెరువులను తలపించాయి. ఆ దృశ్యాలే ఇవి


పిఠాపురంలో జలాశయాన్ని తలపిస్తున్న మార్గాలు


కాకినాడ ప్రధాన రహదారిపై వర్షం నీరు





పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిలిచిపోయిన నీరు




రాజమహేంద్రవరంలో మునిగిన రోడ్లపై వాహనదారుల పాట్లు

నిలిచిన పాపికొండల పర్యాటకం

వర్షాల కారణంగా రాని పర్యాటకులు


పోశమ్మగండి బోటు పాయింట్ వద్ద నిలిచి ఉన్న బోట్లు

దేవీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు పర్యాటకానికి టిక్కెట్ల కొనుగోలు లేకపోవడంతో నిలిచింది. గోదావరి వరదల కారణంగా గత 3నెలల నుంచి పాపికొండలు విహారయాత్రకు బ్రేక్ పడింది. అయితే ఇటీవల గోదావరి తగ్గుముఖం పట్టడంతో 2 రోజుల క్రితం పాపికొండలు పర్యాటకానికి అధికారులు పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా పర్యాటకులు పాపికొండలు పర్యాటకానికి ముందుకురాకపోవడంతో బోట్లన్నీ బోటు పాయింట్ వద్దే నిలిచిపోయాయి.

బాణసంచా సామగ్రి నిల్వల స్వాధీనం

తయారీదారుడి అరెస్ట్

తాళ్లరేవు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాలపై కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ సోమవారం తమ బృందంతో దాడులు నిర్వహించారు. సుంకరపాలెం తోటవారివీధికి చెందిన ఏడిద వీరవెంకట సత్యనారాయణను అక్రమంగా బాణసంచా సామగ్రి నిల్వలను ఉంచినట్టు గుర్తించి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహించే బాణసంచా తయారీ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలి

చింతూరులో ఆదివాసీ నిరుద్యోగుల భారీ ర్యాలీ... జోరు వర్షంలోను ఐటీడీఏ ముట్టడి

చింతూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో నూటికి నూరుశాతం ఉద్యోగ అవకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో భారీ వర్షంలోను ర్యాలీగా ఐటీడీఏ వద్దకు చేరుకుని ముట్టడించారు. కొద్దిరోజులుగా ఆదివాసీ నిరుద్యోగులు మండలంలోని ఆదివాసీ గ్రామాలు పర్యటించి జీవో నెం.3 తొలగింపుతో ఆదివాసీ నిరుద్యోగులకు జరిగిన నష్టంపై వివరించారు. అదేదశలో తమ డిమాండ్లు సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందని నిరుద్యోగులు ఊరూరా పర్యటించి సమావేశాలు, సభలు నిర్వహించి ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ప్రతి ఆదివాసీ స్వచ్ఛందంగా తరలిరావాలని కోరగా పలు ఆదివాసీ సంఘాలు మద్దతునిచ్చాయి. జోరున వర్షం కురుస్తున్నా వెనకడుగు వేయకుండా ర్యాలీ, ముట్టడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆదివాసీ యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి మన్యంలో స్థానిక ఆదివాసీలకే అవకాశం కల్పించాలని, మన్యంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నాయకులు మడివి నెహ్రూ, అప్పల నర్స్, సీసం సురేష్, జల్లి నరేష్, కుంజా శ్రీను, ఉయిక రాంప్రసాద్, కారం సాయిబాబు, పొడియం రామకృష్ణ, మడివిరాజు పాల్గొన్నారు.





చింతూరులో వర్షంలోను ర్యాలీగా వెళ్లి ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

గిరిజనులకు సత్యదీక్షా వస్త్రాల అందజేత


గిరిజనులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో హిందూధర్మప్రచారంలో భాగంగా ఈనెల 17నుంచి సత్యదీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న భక్తులతో సత్యదీక్షలు వేయించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా సోమవారం అడ్డతీగల మండలంలో పవనగిరి స్వామీజీ ఆధ్వర్యంలో సుమారు 600మందికి ఉచితంగా సత్యదీక్ష వస్త్రాలు, దీక్షామాలలను ఈవో సుబ్బారావు దేవస్థానం తరుపున అందజేశారు. 11 గిరిజన మండలాల్లో వీటిని అందజేయగా మిగిలినవారికి అవసరమైతే అందజేస్తామని ఈవో పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంలో సంప్రోక్షణ ప్రారంభం

● వరుస వివాదాల నేపథ్యంలో నిర్వహణ ● మూడురోజుల పాటు కార్యక్రమాలు


సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి వివిధ అంశాలపై ఇటీవల వరుస వివాదాలతో సతమతమవుతున్న నేపథ్యంలో నివారణా చర్యల్లో భాగంగా లోక కల్యాణార్థం దేవస్థానం వైదికకమిటీ సూచనల మేరకు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయంచడంతో సోమవారం ఉదయం నుంచి దర్బారు మండపంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8.56 నిమిషాలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, రుత్విక్‌వరుణలు, మంటపారాధనలు నిర్వహించారు. కల్యాణబ్రహ్మ చామర్తి వెంకటిరెడ్డి, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాలంకి చినపట్టాభి, విజెడి శర్మ నిర్వహించారు. ఈ నెల 15న ఉదయం 11గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి. శ్రీమత్రిపాద్వి భూతి మహావైకుంఠ నారాయణోపనిషత్ పారాయణలు, హోమాది వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవస్థానం పండితులు పేర్కొన్నారు. ప్రధానాలయాల్లో ఏటా ఏదొక యజ్ఞయాగాదులు జరుగుతుంటుండగా అన్నవరం దేవస్థానంలో సైతం నిర్వహించేవారు. అయితే గత రెండేళ్లుగా ఏ యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించలేకపోయారు. తిరుమలలో సైతం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తుంటారు. వరుస వివాదాల నేపథ్యంలో పండితుల సూచనల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బైక్ అదుపుతప్పి కళాశాల రికార్డు అసిస్టెంట్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

అనపర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేమగిరి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్(52) మృతి చెందాడు. వేమగిరికి చెందిన శ్రీనివాస్ రాయవరంలోని జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు వేమగిరి నుంచి మోటార్ సైకిల్‌పై రాయవరం వచ్చి విధులు నిర్వహించుకుని వేమగిరికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన శ్రీనివాస్ కొప్పవరం వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాల పాలైన శ్రీనివాస్‌ను గమనించిన స్థానికులు అతడి ఫోన్ ద్వారా స్నేహితులకు సమాచారం అందించి చికిత్స కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై శ్రీనివాస్ భార్య పద్మావతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ట్రైనీ ఎస్‌ఐ సుజాత పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


నరసింహరాజు మృతదేహం

గోకవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోక వరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన రెడ్డిచర్ల నరసింహ రాజు (39) భార్యతో విబేదాల కారణంగా తూర్పు గోదావరి జిల్లా గోకవరం వచ్చి కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లో హోమ్ నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గోకవరం శివారున ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదస్థితిలో నరసింహరాజు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సులువుగా డబ్బు సంపాదించాలనుకుని నిలువునా మోసపోయి...

స్టాక్ మార్కెట్ వ్యాపారం మోజులో పడి

రూ.74 లక్షల సమర్పణ

రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

రాజానగరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మాయాజాలం వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్ వ్యాపారం పేరుతో నిలువునా మోసపోయి ఏకంగా రూ.74 లక్షలు పోగొట్టుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో ఆగస్టు 17న ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికాడు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా దానిని ఓపెన్ చేశాడు. మరుక్షణమే సావర్ట్ ట్రేడింగ్ పేరుతో వాట్సాప్ యాప్ ఓపెన్ అవ్వగా గ్రూప్‌లో యాడ్ అయినట్టు, స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలంటే డీమేట్ అకౌంట్ ఓపెన్ చేయాలని మెసేజ్ వచ్చింది. దానిలో వివరాలు పూర్తి చేయడంతో అకౌంట్ క్రియేట్ కావడంతో దఫదఫాలుగా సుమారు పదకొండుసార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అనంతరం పెట్టిన అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు రాజానగరం పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ జీవీవీ.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు..

కొండవాగులో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం


యువకుల మృతదేహాల వద్ద పోలీసులు, స్థానికులు

రంపచోడవరం,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యం అందాలు తిలకించేందుకు వెళ్లిన కొండవాగులో స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆదివారం కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన ఓలేటి మణికంఠ, జనన్నాధపురానికి చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ మరో నలుగురు స్నేహితులతో కలిసి రంపచోడవరం మండలంలోని కొత్తపాకలు సమీపంలోని చాపరాయి వద్ద కొండవాగులో స్నానానికి దిగారు. వారిలో మణికంఠ (35), దుర్గాప్రసాద్(35) గల్లంతయ్యారు. మణికంఠ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండగా, దుర్గ ప్రసాద్ పూణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మృతదేహాలు లభ్యం కాలేదు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమవ్వడంతో ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ బస్సును ఢీకొన్న వ్యాన్

వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు




దెబ్బతిన్న బస్సు, వ్యాన్ ముందుభాగాలు

దేవరపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటీ కాలేజీ బస్సును బొలేరో వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న 40మంది విద్యార్థుల్లో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామశివారులో సోమవారం ఉదయం జరిగింది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఉన్న శ్రీవాసవి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో దేవరపల్లి వైపు నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న బస్సును విజయవాడ నుంచి కిరణా సరుకులతో వస్తున్న వ్యాన్ వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఆరుగురికి గాయాలు కాగా దేవరపల్లి మండలం బంధపురం గ్రామానికి చెందిన వెంకటరమణకు నుదుటిపై గాయమైంది. గోపాలపురానికి చెందిన సరిపల్లి రోహిత్‌వెంకట సాయికి ముక్కుమీద గాయమైంది. వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. వ్యాన్ డ్రైవర్‌కు కాలు విరగడంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామశివారు సేరేపాలానికి చెందిన అరిగెల నాగభూషణం(34) వ్యవసాయ కూలీ. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతడి భార్య కేకలు వేస్తు పక్కవారిని పిలిచి గదిలోకి వెళ్లి చూడగా గదిలో ఉన్న ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు సాయంతో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్టు తెలిపారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట మండల పరిధి మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంకు చెందిన మర్రి చినసత్యనారాయణ(65) ఆదివారం రాత్రి ఇంటి నుంచి రోడ్డుపై నడిచి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు పిర్యాదుతో ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

సామర్లకోట చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

మళ్లీ తెరపైకి అంశం

కలెక్టర్‌కు 23 మంది కౌన్సిలర్ల సంతకాలతో వినతి అందజేత

సామర్లకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ వైసీపీకి చెందిన గంగిరెడ్డి అరుణపై అదేపార్టీకి చెందిన 23 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేసారు. ఇప్పటికే ఒక పర్యాయం చైర్‌పర్సన్‌పై స్వపక్ష కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఈ ఏడాది 3 ఏప్రిల్ 2025న అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యూహాత్మకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించి మరో పక్క తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు మే 15న అందజేశారు. అప్పటికే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు జారీ చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో మే15న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబును కలెక్టర్ నియమించారు. సమావేశానికి హాజరైన 25 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ అరుణపై అవిశ్వాసం ప్రకటించారు. అవిశ్వాస ఆరోపణలకు గురైన అరుణ రాజీనామా లేఖ ఉపసంహరించుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్‌కు అదేరోజు మరో లేఖ అందజేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గినా సమస్య కోర్టులోబడి ఉన్నందున ఫలితం వెల్లడించరాదని ఆదేశించడంతో అప్పట్లో ఫలితాన్ని వెల్లడించలేకపోయారు. మరోవైపు అరుణ తాను విదేశాలకు వెళ్తున్నందున తిరిగి వచ్చేవరకూ తాను సమావేశాలకు హాజరుకాలేనని కమిషనర్‌కు లేఖ అందజేశారు. దీంతో నెలవారీ నిర్వహించాల్సిన 2సమావేశాలను అనిశ్చితపరిస్థితుల్లో నిర్వహించలేకపోయారు. తదనంతరం వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గోకిన సునేత్రాదేవిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జూలై 28న రావడంతో 2 సమావేశాలు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 1న విదేశాల నుంచి అరుణ తిరిగి స్వగ్రామం చేరుకోవడంతో చైర్‌పర్సన్ వివాదం తిరిగి తెరకెక్కింది. ఈ నెలాఖరున జరుగనున్న కౌన్సిల్ సాధారణ సమావేశం అరుణ అధ్యక్షతన నిర్వహించేందుకు వీలులేదంటూ మరొకసారి 23 మంది కౌన్సిలర్లు సంతకాలు పెట్టి కలెక్టర్‌కు సోమవారం వినతి అందజేశారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా గత అవిశ్వాసతీర్మాన సమావేశం నిర్దేశాలకు లోబడి జరగలేదని తిరిగి రెండోదఫా ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయినట్లు కమిషనరు శ్రీవిద్య తెలిపారు.

తునిలో మహిళ అదృశ్యంపై కేసు


అదృశ్యమైన సత్యవతి

తుని రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో మహిళ అదృశ్యంపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బళ్ళంకి సత్యవతి (46) గత కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్‌ఐ విజయ్‌బాబు పేర్కొన్నారు. ఈనెల 11న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుమ్మరి వృత్తిదారుల సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్


ధర్మవరంలో కుమ్మరి వృత్తిదారులను కలిసిన ఈశ్వర్

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సోమవారం ఆయన పర్యటించి కుమ్మరి కులవృత్తిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అనంతపురం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ తదితర జిల్లాలో పర్యటించామన్నా రు. అన్ని చోట్ల ప్రధానంగా మట్టి, పనిముట్లు, పాత్రలు కాల్చే ఆములు, షెడ్లు, స్థలాలు, 50 ఏళ్ల పైబడిన కుల వృత్తిదారులకు పెన్షన్‌లు కావాలని వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. త్వరలో వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కుల వృత్తిదారులకు కార్పొరేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు. ఆయన వెంట శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భీమాబత్తుల సత్యనారాయణ, సంఘ నాయకులు స్వయంభారపు వెంకటరమణ, అనకాపల్లి అప్పారావు, అనకాపల్లి నాగేశ్వరరావు, ఉబ్బిశెట్టి నారాయణరావు, పి.అప్పారావు, టిల్లంపూడి బాలాజీ తదితరులున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

క్రాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బాణ సంచా వ్యాపారులు, తయారీదారులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో డివిజన్ అధికారులు, క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బాణసంచా దుకాణదారులు ప్రజల రక్షణార్థం జాగ్రతలు తీసుకోవాలన్నారు.భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు, బాణసంచా విక్రయించే ప్రదేశాల్లో తప్పక నీటి డ్రమ్‌లు, ఇసుక బస్తాలు ఉంచాలన్నారు.అలాగే రాత్రుళ్లు శబ్దకాలుష్యం,ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. నిబంధనలు పాటించాలని లేకుంటే లైసెన్సుల షరతులు పాటించకపోయిన అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలి

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌లో ఏసీ రామలింగేశ్వర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వస్తున్న అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపించాలని అధికారులకు మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి 14 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలన్నారు. వచ్చిన అర్జీల్లో ఇంజనీరింగ్‌కు 4, రెవెన్యూకి 1, టౌన్ ప్లానింగ్‌కు 4, పబ్లిక్ హెల్త్‌కి 2, వార్డు సచివాలయానికి 2, మెప్మాకి 1 ఉన్నాయని తెలిపారు. గడువు ముగిసిన పిటిషన్లు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లక ముందే పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటి సిటీ ప్లానర్ నాయుడు, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, ఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14, 15 తేదీల్లో 'ప్రాచీన భారతీయ విజ్ఞానం పునరుద్ధరించడంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల సదస్సులో 15 మంది విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, కళాకారులు పాల్గొని 16 సెషన్లలో వివిధ అంశాలపై మాట్లాడతారని చెప్పారు. తొలిరోజు సదస్సును రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర ప్రముఖులతోబాటు సుమారు 500 మంది విద్యార్థులు, పరిశోధనా స్కాలర్లు, అధ్యాపకులు పాల్గొంటారని భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బోధనేతర పనులను ఉపసంహరించుకోవాలి

రాజానగరంలో ఎంఈవోలకు ఫ్యాప్టో ఉపాధ్యాయుల వినతి

రాజానగరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై బోధనేతర పనులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ ఫ్యాప్టో(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య)డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజానగరంలో ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్‌లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ అక్టోబరు 10 నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరించడంపై వినతిపత్రం అందజేశామన్నారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధనా సమయం హరించుకుపోతుందన్నారు.ఈ విషయమై పలు దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేపడతామని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేత పనులనుగానీ, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడంగానీ, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమని వినతిపత్రంలో పేర్కొన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దయానిధి, శ్రీనుబాబు, అనిల్, విజయరత్నం, ఎస్టీయూ నాయకులు ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, వీరబాబు, సంజీవ్ అప్పలరాజు, పవన్ పాల్గొన్నారు.

బలభద్రపురం శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన ద్వాదశ లింగాలు, అష్టాదశ శక్తిపీఠ దేవతామూర్తులు

బిక్కవోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మించిన శివాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. ఆలయంలోని శివలింగంపై ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠ దేవతా మూర్తులను, ఆలయ ముఖ మండపంలో విద్యాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ, జయ,విజయ నందీశ్వరులు, చండీశ్వర, మేధా దక్షిణామూర్తి, నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం పార్వతీపరమేశ్వరులకు కల్యాణం జరిపి, మహాన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

బాలికల హక్కులపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం బాలికల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద ఈ ర్యాలీని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏపీ గిరిజన గురుకుల బాలికల ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పి.కోమల, డీపీఎంవో డాక్టర్ కె.శ్రీవల్లి, డిప్యూటీ డెమో సత్యకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమం వద్ద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెశైలజ రాణి ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల అధ్యక్షతన ఆడపిల్లలను రక్షిద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శైలజారాణి మాట్లాడుతూ ఆడ పిల్లలకు మగ పిల్లలతో సమానంగా జీవన, విద్యావకాశాలు కలిగించాలని, వారికి అన్ని రంగాల్లో భాగస్వామ్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎం.సుధామయి, ఎంపీహెచ్‌ఈవో యర్రా సుబ్బారాయుడు, ఆదిలక్ష్మి, సుధాకర్, పి.నందీశ్వరరావు, కె.శారద, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

రంగంపేటలో వైసీపీ నాయకుల నిరసన

రంగంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీని పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం రంగంపేట మంచినీటి చెరువు వద్ద నున్న వైసీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్టేషన్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిలీ మద్యాన్ని తక్షణమే అరికట్టి, బెల్ట్ షాపులను మూసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ సీఐ సుధకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లా శ్రీనివాస్, అడబాల వెంకటేశ్వరరావు,లంక చంద్రన్న, పలాటి నాగేశ్వరరావు,సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, రాంబాబు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న పుష్కరిణి ప్రారంభం

గోకవరం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో గల ప్రసిద్ధ శ్రీరామగిరి క్షేత్ర ప్రాంగణంలో నూతనంగా నిర్మితమవుతున్న పుష్కరిణి పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే నెల 2వ తేదీన పుష్కరిణి ప్రారంభోత్సవానికి చిన్నజీయర్ స్వామి, అహోబిల జీయర్ స్వామిలను ఆహ్వానించినట్టు సభ్యులు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి

» రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

» దివాన్‌చెరువులో 'ఆటో డ్రైవర్ల సేవలో..'పై ఆటో డ్రైవర్ల కృతజ్ఞతలు



ప్రధాని, సీఎం, డీసీఎం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించిన దృశ్యం

దివాన్‌చెరువు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో.. భాగంగా ఆటోడ్రైవర్‌లకు ప్రభుత్వం ఇటీవల రూ.15 వేలు ఆర్థికసాయం చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు సోమవారం ఆటోడ్రైవర్లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రుడా చైర్మన్ మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన నేపథ్యంలో ఆటోడ్రైవర్ల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు ఈ ఆర్థిక సాయం ప్రకటించారని చెప్పారు.యూనియన్ గౌరవాధ్యక్షుడు వంక మమల్లికార్జునస్వామి, అధ్యక్షుడు మెట్టపంట నాగరాజు మాట్లాడుతూ తమ యూనియన్‌లో ఇళ్లు లేని పేదలందరికీ స్థలాలతోబాటు ఆటోస్టాండ్ ఏర్పాటుకు, కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరారు.

ఇదిలా ఉండగా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటున్న దివాన్‌చెరువు జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నలుగురు కానిస్టేబుళ్లను నియమించేలా చూడాలని పలువురు స్థానికులు బీవీఆర్ చౌదరి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరీ ఎక్కువగా ఉంటోందని, ఆ సమయంలో రోడ్డు దాటేందుకు చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలకసాని రాంబాబు, పలివెల లోవరాజు, కొప్పర్తి సూరిబాబు, గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, ఖండవిల్లి లక్ష్మి, మల్లవరపు సత్యానందం, యర్రంశెట్టి శ్రీను, అక్కిరెడ్డివేణు, దేశాల శ్రీను, అడబాల మునసబు, సొసైటీ చైర్మన్ ముత్యం రాజబాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా అచ్చన్నదొర



ఎమ్మెల్యే నెహ్రూకు బొకే ఇస్తున్న అచ్చన్నదొర

గోకవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా బదిరెడ్డి అచ్చన్నదొర నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నుంచి జీవో విడుదలైనట్టు అచ్చన్నదొర తెలిపారు. దీంతో ఆయన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి సీతారామకృష్ణ, పైలా శ్రీను, దేవస్థానం బోర్డు సభ్యులు బొట్టా రామకృష్ణ, చప్పిడి వెంటరాజు, చింతల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

కడియం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వ్యక్తికి కడియపులంక ఉపసర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఆర్థిక సాయం చేశారు. మండలంలోని వెంకయ్యపేటకు చెందిన కర్రి సత్యనారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రాంజీ సోమవారం ఆసుపత్రికి వెళ్లి సత్యనారాయణకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వారా నగేష్, పట్టా బాలు, గొడ్డి సూర్యచంద్ర తదితరులు ఉన్నారు. అలాగే ఇటీవల కడియంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు కడియం బాధ్యతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు ఆధ్వర్యంలో బియ్యం, సామగ్రి, వంట సామాన్లు, గృహోపకరణాలు అందించారు. కార్యక్రమంలో చిలుకూరి శ్రీనివాసరావు, ఎండీ సర్కార్‌బాషా, పున్నమిరాజు వీర్రాజు, కడియం గణేష్, సూరిశెట్టి వెంకట్, కామిరెడ్డి దుర్గారావు, బైరశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి స్పోర్ట్స్ షూ అందజేత



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన రాజమహేంద్రి మహిళా కళాశాల విద్యార్థిని నున్నం భార్గవికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పోర్ట్స్ షూ అందించారు. క్రీడాకారిణి కనీసం షూ లేక ఇబ్బందులు పడుతుందని డివిజన్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఆదిరెడ్డివాసు సోమవారం తన కార్యాలయంలో భార్గవికి స్పోర్ట్స్ షూ అందించారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల సిబ్బంది

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య(సీపీఆర్) అవసరం ఎవరికి, ఎక్కడ, ఎప్పుడు వస్తుందో తెలియదు కాబట్టి ప్రతిఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ బోధనాసుపత్రిలో సీపీఆర్‌పై వైద్య విద్యార్థులు, డాక్టర్లు, నర్సింగ్, వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్రం దేశమంతటా సీపీఆర్ అవగాహన వారోత్సవాలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమైనంతవరకూ ప్రతి పౌరుడికి సీపీఆర్‌పై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శారద, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్, కళాశాల ఇతర విభాగాల అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రభుత్వ బోధనాసుపత్రి అనస్థీషియా హెచ్‌వోడీ సోఫియా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కంబాలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రకాశం నగర్ ఎస్టీ బాలికల వసతి గృహంలోని బాలికలకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ అనూహ్య మల్లాది మాట్లాడుతూ ఎవరైనా గుండెపోటు వల్లగాని, విద్యుత్ షాక్ వల్లగాని,శ్వాస లేదా గుండె పనిచేయడం ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలకు రక్షించవచ్చని అన్నారు. సైకాలజిస్ట్ ప్రియాంక బాలికల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.డీపీఎంవో వీరయ్య లెప్రసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 262 మంది బాలికలను పరీక్షించి అందులో 125 మందికి సికిల్‌సెల్ అనీమియా రక్త పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ డీడీ భవాని, హాస్టల్ వార్డెన్ త్రివేణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భూసేకరణ అధికారుల అక్రమాలను అడ్డుకుంటాం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

» ధవళేశ్వరంలోని పోలవరం ఆర్అండ్ఆర్ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో చోటుచేసుకున్న అక్రమాలను అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గిరిజనుల పోరాటాలకు సీపీఎం పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. సోమవారం ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాలకు చెందిన గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు శ్రీనివాసరావు మద్దతు తెలుపుతూ పాల్గొని మాట్లాడారు. బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటి వరకూ ఐదు నోటిఫికేషన్లు ఇచ్చారని, ప్రతి నోటిఫికేషన్‌లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. గ్రామసభలు నిర్వహించలేదని, పీసా కమిటీల అనుమతులు లేకుండానే నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను భూ స్వాముల పేరుతో రికార్డుల్లో నమోదు చేశారని, ఇటువంటి అక్రమాలను అడ్డుకుని గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. పోలవరం భూసేకరణ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని, ప్రతి ఎకరాకు బహిరంగ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్ దీనిపై స్పందిస్తూ నిరసన ధర్నా వద్దకు చేరుకుని గిరిజనులు, నాయకులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకుని వారి నుంచి అభ్యర్థనలను స్వీకరించారు. ఏలూరు జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో చర్చించి సమస్య పరిష్కార దిశగా చొరవ చూపిస్తానని తెలిపారు. ఏలూరు జిల్లా సీపీఎం కార్యదర్శి ఎ.రవి, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కరరావు, తెల్లం దుర్గారావు, బి.పవన్, ముత్యాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

కోరుకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాణాసంచా తయారీ కేంద్రాల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు అన్నారు. సోమవారం కోరుకొండలోని ముత్యం శ్రీనివాస్ బాణసంచా తయారీ కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాణసంచా తయారీ కేంద్రాలపై దృష్టి సారించి, ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు.జిల్లాలో కడియం, బుర్రిలంక, రాజానగరం, కోరుకొండ తదితర ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయాల వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామాలకు దూరంగా విక్రయాలు జరపాలని, అవాంఛనీయ ఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చేటప్పుడు పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో సీఐ సత్య కిషోర్, ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లాని కలిసిన నాయకులు

స్థానిక సమస్యలపై వినతి సమర్పణ

కోరుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును రాజానగరం నియోజకవర్గ నాయకులు కలిశారు. నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల సమస్యలపై మండలాలు వారీగా వినతిపత్రం సమర్పించినట్టు టీడీపీ నాయకులు దూది కాంతారావు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, మల్ల అప్పల నరసారావు, గండి విజయ్ కుమార్, బుద్ధ బాపూజీ, మద్దాల రమణ, తనకాల వెంకటరమణ పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్ వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): బహు భాషా గాయకుడు కిషోర్‌కుమార్ 39వ వర్ధంతిని స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో సోమవారం జిత్ మోహన్ మిత్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. కిషోర్‌కుమార్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మిత్ర మాట్లాడుతూ, కిషోర్‌కుమార్ తన మధుర గాత్రంతో పలు పాటలు పాడి, ప్రపంచంలో గర్వించదగ్గ గాయకులలో ఒకరిగా నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా హేమనళినికి, గాన కోకిల లతామంగేష్కర్ పురస్కారం అందించి సత్కరించారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ,పద్మ, ఫణిసారధి, సోమరాజు, బాషా, సీహెచ్ సీతామహలక్ష్మి, సుదర్శన్ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో సామాన్యులకు ఊరట : కలెక్టర్



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఊరట లభిస్తోందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం వై-జంక్షన్ నుంచి పుష్కరాల రేవు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు జీవితాలను మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తే దేశాభివృద్ధిలో నేరుగా భాగస్వాములైనట్లేనన్నారు.అనంతరం పుష్కర ఘాట్ వద్ద పొదుపు సంఘాల మహిళలతో స్వదేశీ వస్తువుల ప్రదర్శన నిర్వహించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు మేలు జరుగుతుందన్నారు. నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఔషధాలు, విద్య, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువుల పన్నులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ వీపీ రామలింగేశ్వర్, డీసీ ఎస్.వెంకటరమణ,కమర్షియల్ ట్యాక్స్ అధికారి రత్నకుమార్, సెక్రటరీ శైలజవల్లి, డీసీపీ నాయుడు, డాక్టర్ వినూత్న, మెప్మాపీడీ కనకరాజు, సీఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

లిక్కరు దందాపై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో లిక్కరు దందాపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బర్ల బాబురావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపైన, బెల్ట్‌షాపు నిర్వాహకులపైన, అనుమతులు లేకుండా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తున్నవారిపైనా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

ఆగితే..బతుకు బండి సాగదు!





ఆగదు.. సాగదు..చినుకుపడిందని ఆగిపోతే బతుకుబండి సాగుతుందా.. తడిచినా అడుగుపడాల్సిందే.. కడుపు నింపుకోవడానికి కష్టపడాల్సిందే.. సోమవారం ఉదయం రాజమహేంద్రవరంలో భారీ వాన కురిసింది.. ఒక పక్కన చినుకులు పడుతూనే ఉన్నాయి.. అయినా ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు.. ఒక రిక్షా వాలా చినుకులో తడుస్తూనే బతుకు బండి లాగాడు.. పాల వ్యాపారిది ఇదే పరిస్థితి.. ఇక పారిశుధ్య కార్మికులైతే వాళ్ల పనిలో వాళ్లు ఇలా కెమెరాకు చిక్కారు.. అవును ఆగితే బతుకుబండి సాగుతుందా.. కష్టపడాల్సిందే మరి!

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్ 2),భవనం సంఖ్య 02,బీరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.10.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO 6-12-5/1,SECOND FLOOR,OPP:KOTIPALLI BUS STAND,INNESPETA, RAJAHMUNDRY-533101,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
DVLSMPJ2504080001	KUDIPUDI VENKATA SATYADURGA	DVLSMPJ2504170002	YARLAGADDA PRASAD
		NDVL1PJ2504140001	SRINIVASU

వేలం సమయం: 11.00 AM, మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ డి.రఘు రామరాజు** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.10.2025
స్థలం: రాజమండ్రి

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



వాడపల్లి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా సాగుతున్నాయి.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకుంటున్నారు.. నాలుగో రోజు సోమవారం రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు గోవిందా.. గోవింద అం టూ నామస్మరణ చేశారు. విద్యుత్‌కాంతుల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.

6

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై

అవగాహన ర్యాలీ

గిగ్ వర్కర్ల ఉపాధి మెరుగు : ఆర్డీవో

8

కృష్ణంపాలెంలో

కాలేజ్ బస్‌ను ఢీకొన్న బొలెరో

డ్రైవర్, విద్యార్థులకు గాయాలు

కుమ్మేసిన వాన

రాజమహేంద్రవరం సిటీ/ కొవ్వూరు/ నల్లజర్ల , అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు వర్షం భారీగా కురిసింది. జిల్లాలో అత్యధికంగా 48.0 మీమీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గోకవరంలో 0.2 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో సగటున 13.5 శాతం వర్షం పడింది.రాజమహేంద్రవరంలో 30.2 మి.మీ , రాజానగరంలో 28.2, రంగంపేటలో 26.8, గోపాలపురంలో 12.8, రాజమహేంద్రవరం రూరల్‌లో 12.4, తాళ్ళపూడిలో 11.2, నిడదవోలులో 11.0, చాగల్లులో 10.8, సీతానగరంలో 10.4, పెరవలిలో 9.4 , దేవరపల్లిలో 9.2 , బిక్కవోలులో 8.8, కడియంలో 8.4, కొవ్వూరులో 6.2, ఉండ్రాజవరంలో 6.0 , అనపర్తిలో 3.8, కోరుకొండలో 3.2 మి.మీల వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది. రాజమహేంద్రవరం, రాజానగరం, రంగంపేట మండలాల్లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో సోమవారం ఉదయం సుమారు గంటసేపు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ముంపునకు గురయ్యాయి. ఉదయం పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు పడారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయం, పట్టణ పోలీస్‌స్టేషన్, కోర్టు ప్రాంగణాలకు వెళ్లే రోడ్డుపై వర్షపునీరు నిలిచి ప్రజలు, కక్షిదారులు అవస్థలు పడ్డారు. నల్లజర్ల చెక్కుపోస్టు వద్ద వరద నీరు భారీగా చేరి రాకపోకలకు అంతరాయం కలిగించాయి. బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





కాలువ కాదు సుమా : రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన వాన నీటిలో వాహనాలు



దారేది : నల్లజర్లలో జాతీయ రహదారిపై వాన నీటి ప్రవాహం



కొవ్వూరు కోర్టు రోడ్డులో నిలిచిన నీరు

అవినీటి.. ఆవ!



వ్యర్థాలతో నిండిన ఆవ ఛానల్

మురుగునీటి శుద్ధి పేరుతో కోట్లు వృథా

- కాంట్రాక్టర్లు,అధికారులు మింగుడే
- ఎస్‌టీపీకి ఏడాదికి రూ.50 లక్షలు
- అక్కడ శుద్ధి చేసేది తక్కువ..
- ఆ నీరు మళ్లీ ఆవ చానల్‌కే
- ఆ మురుగు గోదావరిలోకే
- అవుట్‌లెట్ లేకుండా శుద్ధి?
- మరో రెండు ఎస్‌టీపీలు రెడీ

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో మురుగునీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రూ.కోట్లు వృథా అవుతున్నాయి. శుద్ధిచేసిన మురుగునీటికి అవుట్‌లెట్ లేకపోవడం రూ.కోట్ల అవినీతికి అవుట్‌లెట్‌గా మారింది. ఎస్‌టీపీ నుంచి ధవళేశ్వరం సాయిబాబా గుడి వరకూ సుమారు 5.5 కిలోమీటర్ల మేర ఈ ఆవ ఛానల్ ఉంది.ఎస్‌టీపీ నీటిని దీనిలోకి వదిలేస్తున్నామని చెబుతున్నారు. కానీ చానల్ అంతా పూడుపోయింది. పైగా హుకుంపేట, వీఎల్ పురం, బాలాజీపేట నుంచి వచ్చే మురుగునీరంతా ఈ చానల్ గుండా ధవళేశ్వరం సాయిబాబా గుడి సమీపం నుంచి గోదావరిలో కలుస్తోంది. ఇందులో శుద్ధిచేసిన నీరు ఉందని చెబుతున్నారు. కానీ ఉపయోగం ఏముంది. చివరకు గోదావరిలో మురుగునీరే కలుస్తుంది. పైగా ఆవ ప్రాంతమంతా మురుగునీరు పేరుకుపోవడం గమనార్హం. ఈ మురుగునీటి ప్రవాహానికి సరైన అవుట్‌లెట్ లేకుండా ఎంత చేసినా అది దోపిడీనే. ప్రజాధనాన్ని వృథా చేయడమే.



ఏడాదికి రూ.50 లక్షలు వృథా

ఆవలో ప్రస్తుతం పనిచేస్తున్నట్టు చెబుతున్న 30 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంట్‌కు ఏడాదికి రూ. 50 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇదంతా ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ శుద్ధి చేసిన నీరు సద్వినియోగమైతే ఈ ప్లాంట్ నిర్వహణకు ఎంత ఖర్చు చేసినా తప్పుండదు. కానీ ఆవ నుంచి వచ్చిన మురుగునీరు రోజుకు 30 మిలియన్ లీటర్ల నీటిని ఇక్కడ శుద్ధి చేస్తున్నట్టు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి అలా లేదు. ఇక్కడ ఆవ చానల్ పూర్తిగా పూడుపోయింది. ఇదంతా అవినీతికి అవుట్‌లెట్టే. ఆవ చానల్ నీటినంతా శుద్ధి చేస్తు న్నట్టు చెబుతుంటారు. కానీ చిన్న చానల్ ద్వారా కొంత నీరు మాత్రమే ఎస్‌టీపీకి వెళుతుంది. మిగతా నీరంతా ఆవ చానల్ నుంచే ముందుకు పోతోంది.

ఎస్‌టీపీలు నిర్మాణం..

ఆవ చానల్ నుంచి వచ్చిన నీటిని శుద్ధి చేయడానికి వాంబే గృహాలకు కూత వేటు దూరంలో గతంలోనే 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మించారు. ఇక్కడే 55 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణంలో ఉంది. దాని పక్కనే అమృత పథకం కింద 5 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణంలో ఉంది. ఇవి ఫిబ్రవరికి పూర్తి కావొచ్చని అధికారులు చెబుతున్నారు. కొత్తవి పూర్తయితే మొత్తం 90 ఎంఎల్‌డీ డ్రైనేజీ వాటర్‌ను శుద్ధి చేయవచ్చు. కానీ ఈ నీటిని బయటకు పంపడానికి సరైన అవుట్‌లెట్ లేదు. ఆవ ఛానల్ నిర్మించి అక్కడ నుంచి ధవళేశ్వరం దిగువన గోదావరిలో ఈ మురుగు కలిపే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ధవళేశ్వరం వద్ద ఓ చిన్న ఎస్‌టీపీని నిర్మించడానికి ఇరిగేషన్ అధికారులు మోకాలడ్డుతున్నారు.

మెకానికల్ స్ర్కీనింగ్ రూ.1.10 కోట్లు

ఎస్‌టీపీకి ముందు ఈచానల్ మీద రూ.కోటి 10 లక్షలతో మెకానికల్ స్ర్కీనింగ్ ఏర్పాటు చేశారు.వైసీపీ హయాంలో ఇదో కాంట్రాక్టర్‌కు అప్పగించారు.ఇది కూడా మరో అవినీతి బాగోతం ఉంది.ఈ స్ర్కీన్ ఆవ చానల్ నుంచి వచ్చిన చెత్తనే తీసి గట్టుమీద వేస్తుంది. మురుగునీరు ముందుకు పోతుంది. అందులో నుంచి కొంత మురుగునీటిని ఎస్‌టీపీకి ఉపయోగిస్తారు. కానీ రోజుకు కొద్దిగా చెత్తను మాత్రమే తీస్తారు. ఎండిన తర్వాత డంపింగ్ చేస్తున్నారు.

మురుగంతా చేరేది ఆవకే..

నగరపాలక సంస్థలో 60 మిలియన్ లీటర్ల (60 ఎంఎల్‌డీ) మురుగునీరు లభ్యమవుతోంది.చెత్త రోజుకు 160 టన్నులు వస్తుంది. చెత్త కొంత వరకూ లూదర్‌గిరిలోని క్వారీగొయ్యిలో వేస్తున్న సంగతి తెలిసిందే. కోరుకొండ రోడ్డు, లలితానగర్ వాటి ఎగువ ప్రాంతాల నుంచి మురుగంతా నల్లా ఛానల్ ద్వారా గోదావరిలోకి పంప్ చేస్తారు. ఇక లాలా చెరువు వైపు నుంచి ఆర్ట్స్ కాలేజీ మీదుగా వచ్చే మురుగు కంబాల చెరువులోకి చేరుతోంది. అక్కడ నుంచి ఆవ చానల్‌కు పంప్ చేస్తారు. మెయిన్ మార్కెట్, ఏవీ అప్పారావు రోడ్డు, హుకుంపేట, బాలాజీపేట తదితర ప్రాంతాల మురుగంతా ఆవచానల్‌కే వస్తుంది. కార్పొరేషన్‌లోని ఎక్కువ మురుగునీటిని షెల్టాన్ హో టల్ ప్రాంతంలోని ఆవ చానల్లోకి పంప్ చేస్తున్నారు. కొంత సహజంగా చేరుతోంది.

ఇలా చేస్తే బెటర్?

ఆవ ఛానల్ క్లియర్ చేయాలి. ఆక్రమణలు తొలగించి,వేగంగా మురుగు ప్రవహించేడ్రైన్‌గా రూపొందిస్తే చాలా వరకూ సమస్య తీరుతోంది. కొత్త ఎస్‌టీపీలు ఫిబ్రవరిలో పూర్తి చేసినా, శుద్ధిచేసిన నీటిని ఎక్కడకు పంపి స్తారు. మొక్కలు,బస్టాండ్; రైల్వే స్టేషన్లలో వినియోగానికి (తాగునీటికి కాదు) ఉపయోగిస్తామనే ప్రతిపాదన ఉంది. అవన్నీ సిద్ధం చేసి ఒక స్పష్టమైన ప్రణాళికతో పనులు చేస్తేనే ఈ ఎస్‌టీపీల ఉపయోగం..లేకపోతే నిర్వహణ పేరిట రూ.కోట్లు దోపిడీయే అవుతుంది.

ఇంకేం ఉపయోగం?

కార్పొరేషన్‌లో పెద్ద ఎత్తున పారిశుధ్య వ్య వస్థ ఉంది.అయినా ఆవ ఛానల్ చెత్తతో నిం డిపోతుంది.వాస్తవానికి కంబాలచెరువులో మురుగునీటిని తోడడానికి ఓ పంపు హౌస్ ఉంది. ఇక్కడ నెలకు రూ.1.5 లక్షల ఖర్చవుతుంది. కేవలం మురుగునీటిని ఎత్తిపోయ డానికే ఇంత ఖర్చవుతోంది. ఏబీ నాగేశ్వరరావు పార్కు సమీపంలో మరో పంపింగ్ హౌస్ ఉంది. మెకానికల్ స్ర్కీన్ ఉంది.ఇక్కడ నెలకు రూ.60 వేల వరకూ ఖర్చవుతుంది.ఇంత జరిగినా ఇక్కడి మురుగునీరు ఆవ చానల్‌లోకి వెళ్లేసరికి టన్ను ల కొద్దీ చెత్త పేరుకుపోతుంది.



పంచాయతీలకో గ్రేడ్

- జిల్లాలో 299 పంచాయతీలు
- స్పెషల్ గ్రేడ్ 26, గ్రేడ్-1 134
- గ్రేడ్-2లో 79, గ్రేడ్-3 60
- ఇక పీడీవోలుగా సెక్రటరీలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల విధానాన్ని ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. ప్రతీ గ్రామం ఒక పంచాయతీగా ఉంటుంది. గతంలో రెండు మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా పిలిచేవారు.ఇక ఏ పంచాయతీకి ఆ పంచాయతీనే ప్రత్యేక గుర్తింపుతో ఉంటుంది. అంతేగాక పంచాయతీ సెక్రటరీలను ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో)లుగా మార్చారు. పంచాయతీల జనాభా, ఆదాయాన్ని అనుసరించి నాలుగు కేటగిరీలుగా విభజించారు. పెద్ద పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (రూర్బన్ పంచాయతీ)లుగా మార్చి, తర్వాత ఆదాయాన్ని జనాభాను బట్టి గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా వర్గీకరించారు. చాలా కాలం తర్వాత జరిగిన ఈ ప్రక్షాళనకు ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా అందులో 26 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ (రూర్బన్) పంచాయతీలుగా గుర్తించారు. వీటికి డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారి ఉంటారు.ఇక్కడ కూడా ప్రణాళిక, ఇంజనీరింగ్, వాటర్ సప్లయి, శానిటేషన్, రెవెన్యూ వంటి విభాగాలు ఉంటాయి. అందుకే వీటిని రూర్బన్ పంచాయతీలు అంటారు. వాస్తవానికి జిల్లాలో రాజమహేంద్రవరం డివిజన్ నుంచి జిల్లా యంత్రాంగం 20 పంచాయతీలు స్పెషల్ గ్రేడ్, 42 గ్రేడ్-1, 64 గ్రేడ్-2, 21 గ్రేడ్-3గా ప్రతిపాదించారు. డివిజన్‌లో మొత్తం 246 పంచాయతీలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్‌లో 11 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు, 48 గ్రేడ్-1, 55 గ్రేడ్-2, 39 గ్రేడ్ -3గానూ గుర్తించి ప్రతిపాదించారు.ఈ డివిజన్‌లో మొత్తం 153 పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 299 పంచాయతీలు ఉండగా స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా 31, గ్రేడ్-1 - 89, గ్రేడ్-2 -119, గ్రేడ్-3 -60 పంచాయతీలు విభజించి ప్రభుత్వానికి పంపారు.అక్కడ పరిశీలించి కొద్దిగా మార్పులు చేశారు. అందులో స్పెషల్ గ్రేడ్ 26,గ్రేడ్-1 134, గ్రేడ్-2 79, గ్రేడ్-3 60 ఉంచారు.వీటిని అధికారికంగా ధ్రువీకరిస్తూ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అప్పుడే ఏ పంచాయతీ ఏ కేటగిరీలో ఉందో స్ప ష్టమవుతోంది.త్వరలోనే ఉత్తర్వులు రానున్నాయి.

జవాబుదారీతనం కలిగి ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 137 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ కీర్తి, జేసీ

ఎస్పీ గ్రీవెన్స్‌కి 30 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 30 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించి వారి సమస్యలపై ఆరా తీశారు. చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఫ్యాక్టరీల్లో భద్రత ప్రమాణాలు

తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పారిశ్రామిక భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో 9 కేటగిరీ ఏ, 13 కేటగిరీ బీ, 13 కేటగిరీ బీ2లో పెద్ద ప్రమాదాల సంభావ్యత ఉన్న కర్మాగారాలు ఉన్నాయన్నారు. ప్రతి ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రత అధికారిని నియమించాలన్నారు. అత్యవసర అలారం సజావుగా పని చేయాలన్నారు. భద్రతా చర్యలపై ప్రతి కర్మాగార యాజమాన్యం 45 రోజుల్లో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎవరూ హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ మేఘస్వరూప్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఆర్డీవో కృష్ణనాయక్ పాల్గొన్నారు.

నిలిచిన పాపికొండల బోట్లు

దేవీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు పర్యాటకానికి బ్రేక్ పడింది. గోదావరి వరదల కారణంగా గత 3 నెలలుగా పాపికొండలు విహార యాత్ర నిలిపివేశారు.గోదావరి తగ్గుముఖం పట్టడంతో రెండు రోజుల కిందట పాపికొండలు పర్యాటకానికి పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా పర్యాటకులు పాపికొండలు పర్యాటకానికి ముందుకురాకపోవడంతో బోట్లన్నీ బోటు పాయింట్ వద్దే నిలిచిపోయాయి.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వేణుగోపాలకృష్ణ తదితరులు

వైసీపీ నాయకుల ధర్నా

రాజమహేంద్రవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో మద్యం విక్రయాలు ఎలా సాగాయో, జే బ్రాండ్లను ఎలా అమ్మారో, కనీసం డిజిటల్ లావాదేవీలు లేకుండా అమ్మకాలు చేసి రూ.కోట్లు దోచుకున్న వైసీపీ స్కామ్ బయటపడి, ఒక్కోనేత జైలు పాలవుతున్నారు.ఈ నేపథ్యంలో ఎక్కడో ఒకచోట దొరికిన నకిలీ మద్యం పేరు చెప్పి వైసీపీ ఆందోళనలు చేయడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. నకిలీ మద్యంతో పట్టుపడిన నేతలను కూటమి ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.దీనిని రాజకీయం చేస్తూ వైసీపీ సోమవారం జిల్లాలో ఎక్సయిజ్ కార్యాలయాల వద్ద ధర్నా చేసింది.కలెక్టరేట్ వద్ద వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, రాజమండ్రి ఎక్సయిజ్ ఈఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎంపీ మార్గాని భరత్ వేర్వేరుగా ఆందోళనలు చేశారు. రంగంపేట స్టేషన్ వద్ద అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, దేవరపల్లిలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, కొవ్వూరులో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

17 నుంచి ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 221 కేంద్రాలు ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. ఈ నెల 17 నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి,జేసీ వై.మేఘస్వరూప్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఖరీఫ్ ధాన్యం సేకరణ, కొనుగోలు విధానంపై కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఏ రైతు కనీస మద్దతు ధర కంటే తక్కువకు పంట అమ్మాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని జేసీ తెలిపారు.ఈ పంట నమోదు చేసుకున్న రైతుల నుండి మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరుగు తుందన్నారు. ప్రభుత్వం జమ చేసే మొత్తం అంతా నేరుగా రైతుల ఖాతాకు జమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, డీఎస్‌వో వి.పార్వతి,మేనేజరు బి.గణేష్ కుమార్ పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లి సొసైటీ ఉద్యోగి భారతి సస్పెన్షన్

సీతానగరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) వెదుళ్ళపల్లి సొసైటీలో జరిగిన రూ 1.34 కోట్లు అవినీతిలో 32 మంది బాధిత రైతులకు ఊరట లభించింది. సొసైటీ సీఈవో శివరామకుమారి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కృష్ణమోహన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు. సభ్యులు అడిన ప్రశ్నలకు కృష్ణమోహన్ స్పందిస్తూ రేషన్ సరుకుల్లో సంఘానికి రావాల్సిన కమీషన్ రూ.3,27,236లు, ఎరువుల్లో రూ.8,29, 398లు అదనంగా అవినీతి బయటపడిందన్నారు.మొత్తం రూ.1,34,41,272లో ఇంత వరకు రూ. 58,15, 272 రికవరి కాగా ఇంకా 76,26,000/-లు రికవరి కావలసి ఉందన్నారు.విచారణ పూర్తయినందున ఆర్డర్స్ రాగానే రైతుల రుణాలకు క్లియరెన్స్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. సొసైటీలో పనిచేస్తున్న సబ్‌స్టాఫ్ భారతిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుటూరి విశ్వనాథం, పెందుర్తిరాజా, పెందుర్తి బుజ్జయ్య చౌదరి రైతులు పాల్గొన్నారు.




మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య

● ఉపాధ్యాయులను అభినందించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా విద్యారంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు పట్టణంలోని పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ హైస్కూల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 13 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా విద్యా బోధన చేసి, మెరుగైన ఫలితాలను తీసుకువచ్చి, ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై సంతకం చేసిన విషయం మనందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్జిల్లి రామకృష్ణ, బొల్లిన నాగేంద్ర, ఎంఈవో- 2 రామకిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలంలో నూతనంగా నియమించిన ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో 30మంది, ప్రాథమిక పాఠశాలలో నలుగురు, మొత్తం 34 మంది ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈవోలు కే.తిరుమలదాసు, కేఆర్ఎస్ వీవీ అప్పారావులు తెలిపారు. వీరికి అభినందనలు తెలిపారు.

శ్రీశైలం మల్లన్న సేవలో మద్దిపాటి


శ్రీశైలంలో మల్లిఖార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

గోపాలపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీశైలం శ్రీభ్రమరాంబసమేత మల్లిఖార్జునస్వామిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యంతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నానని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రం ప్రజలకు సుపరిపాలన అందించేలా, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్ 2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.10.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO 6-12-5/1,SECOND FLOOR,OPP:KOTIPALLI BUS STAND,INNESPETA, RAJAHMUNDRY-533101,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
DVLSMPJ2504080001	KUDIPUDI VENKATA SATYADURGA	DVLSMPJ2504170002	YARLAGADDA PRASAD
		NDVL1PJ2504140001	SRINIVASU

వేలం సమయం: 11.00 AM, మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ డి.రఘు రామరాజు ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.10.2025
స్థలం: రాజమండ్రి
అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్





జీఎస్టీ 2.0 సంస్కరణలతో గిగ్ వర్కర్లకు ఉపాధి మెరుగు


సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలతో గిగ్ వర్కర్లకు ఉపాధి మెరుగు పడుతుందని కొవ్వూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పరిమి రాధాకృష్ణ అన్నారు. సోమవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.బుల్లిరాణి, లేబర్ ఆఫీసర్ ఎం.లలితకుమారిల ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, గిగ్ వర్కర్స్ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వ్యాపారులు పట్టణ పురవీధులలో మోటారుసైకిళ్లపై ర్యాలీ నిర్వహిస్తూ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో రాణిసుస్మిత మాట్లాడుతూ గిగ్ ఎకానమీతో స్వయం ఆధారిత జీవనవిధానం బలపడుతుందన్నారు. జీఎస్టీ 2.0 అమలుతో మందులు, ఇన్సూరెన్సూలకు సంబంధించి జీఎస్టీ తగ్గించామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, వ్యాపారులు పాల్గొన్నారు.


డ్రైన్లలో పూడిక తీస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే కృషితో పక్కా డ్రైన్ల నిర్మాణం

దేవరపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో భారీ వర్షం గంటన్నరపాటు దంచి కొట్టింది. ఒక్కసారిగా యాదవోలు వాగు మారుతి నగర్‌కాలనీ నుంచి అంబేడ్కర్‌నగర్ కాలనీ మీదుగా వెళ్లే వాగులో వరదనీరు ప్రవహించింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు మాట్లాడుతూ దేవరపల్లిలో రూ.5కోట్ల70లక్షలతో డ్రైన్లు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గతంలో భారీ వర్షాల వలన షాపింగ్ కాంపెక్స్‌లు, ఇళ్లు ముంపునకు గురయ్యేయని అప్పుడు ముంపు ప్రాంతాలు పర్యటించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దేవరపల్లిలో ముంపునకు గురికాకుండా ప్రత్యేకడ్రైన్లు నిర్మించారని రామారావు తెలిపారు.

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరపాలి

● వైసీపీ నాయకుల డిమాండ్

దేవరపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పేద వాడి జీవితంతో చేలగాటం ఆడుతున్న కల్తీ మ ద్యం ముఠాలపై సీబీఐ విచారణ జరిపించాలని గోపాలపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్, మాజీహోంమంత్రి తానేటి వనిత డిమాండ్ చేశారు. దేవరపల్లిలో సోమవారం ఎక్సైజ్ కార్యా లయంవద్ద కల్తీమద్యంపై ఆందోళన నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వ్యవ సాయశాఖాధికారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా మాజీ మంత్రి తానేటి వనిత మా ట్లాడుతూ కల్తీమద్యం వలన అనేక మంది ప్రా ణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనా రాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు గన్నమని జనార్ధనరావు, నరహరశెట్టి రాజేంద్రబాబు, వైసీ పీ నాయకులు వెలగా శ్రీరామమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి,రామ్మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.


దేవరపల్లి ఎక్సైజ్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత, వైసీపీ నాయకులు

నకిలీ మద్యం అరికట్టాలని ధర్నా

కొవ్వూరు(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం దం దాపై సీబీఐతో విచారణ జరిపించాలని వైసీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంవద్ద సోమవారం నకిలీ మద్యం అరికట్టాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. సీఐ జి.సత్యనారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నకిలీ మద్యం సేవించి సుమారు 421 మంది మృతి చెందారన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, గండ్రోతు సురేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, రుత్తల భాస్కరరావు, నగళ్ళపాటి శ్రీనివాస్, కవల నాగేశ్వరరావు, బోడపాటి హనుమంతరావు, దేవగుప్తాపు లక్ష్మణరావు, పరిమి సోమరాజు, యు.సూరిబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీమ ద్యం రాష్ట్ర మంతా ఏరులైపారుతుందని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంవద్ద వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహి ంచారు. ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జైరామ్ సతీష్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మె ల్యే జి.శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ నాణ్య మైన మద్యం అని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యం సరఫరా చేస్తుందని నకిలీ మద్యం తయారీ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్తిబాబు, బూరుగుపల్లి సుబ్బారావు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక హింసలను అరికట్టాలి

కొవ్వూరు, అక్టోబరు 13(ఆంధ్ర జ్యోతి): మహిళలపై లైంగిక హింసలను అరికట్టాలని కోరుతూ మహిళలు ఆందోళన చేపట్టారు. కొవ్వూరు మండ లం గోవర్ధనగిరిమెట్ట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన నిర్వహించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేదం అమలుచేయాలని, ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలని, మహిళలపై లైంగిక హింసలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. పీవోడబ్ల్యు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈ.మల్లిక మాట్లాడుతూ మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతుందని, అరికట్టడంలో ప్రభుత్వాలు వైఫ ల్యం చెందుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. జి.రాజామణి, మేరీ, సుభాషిణి, మేరిగ్రేసి, చంద్ర, మార్తమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదంలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ విధానం మేలు

ఉండ్రాజవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ప్రమాదంలో ఉన్నపుడు సీపీఆర్ విధానం చేస్తే మేలు జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.దుర్గామహేశ్వరరావు పేర్కొన్నారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీలో సీపీఆర్ విధానం గురించి సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గామహేశ్వరరావు మాట్లాడు తూ ఏ వ్యక్తి అయినా విద్యుత్ షాక్, యాక్సిడెంట్, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు వలన గుండె కొట్టుకోవడం ఆగిపోయి, అచేతనంగా పడిపోయినపుడు దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించడంగాని, 108 లేదా ఇతర అంబులెన్స్‌లకు ఫోన్ చేయాలన్నారు. ఈలోగా ప్రమాదానికి గురైన వ్యక్తిని గమనించి నాడిచూసి నాడి కొట్టుకోవటంలేదని గుర్తిస్తే వెంటనే సీపీఆర్ చేయాలని ఆయన సూచించారు. అలా చేసినపుడు వ్యక్తి కదలిక వస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. అనంతరం సీపీఆర్‌పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, స్టాఫ్ నర్స్ జి.బ్యూలా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో భోజనం ప్లేట్లు పంపిణీ

నిడదవోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి రోటరీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షులు మీసాల శివరామహరిప్రసాద్ అన్నారు. సోమవారం నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ అయినీడి సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారుడు పల్లారావు సహకారంతో భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు.

కళాశాల బస్సును ఢీకొన్న వ్యాన్

● వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు,
● ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు

దేవరపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కాలేజీ బస్సును బొలిరోవ్యాన్ ఢీకొనడంతో బొలెరోవ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, బస్సులో ప్రయాణిస్తున్న 40మంది విద్యార్థుల్లో ఆరుగురికి స్వల్పగాయాలైన ఘటన దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామశివారులో సోమవారం ఉదయం జరిగింది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఉన్న శ్రీవాసవీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులను దేవరపల్లివైపు నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న బస్సును విజయవాడ నుంచి కిరాణాసరుకులతో వస్తున్న బొలిరో వ్యాన్ బస్సును వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈబస్సులో ఆరుగురికి గాయాలుకాగా వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. బొలిరోవ్యాన్ డ్రైవర్‌కు కాలువిరగటంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.


వ్యాన్ ఢీకొనడంతో కాలేజీ బస్సు దెబ్బతిన్న ముందుభాగం, నుజ్జునుజ్జయిన వ్యాన్

16న కోట సత్తెమ్మ హుండీ లెక్కింపు

నిడదవోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 16న గురువారం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 9 ఫిర్యాదులు


పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజనల్ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 9 ఫిర్యాదులను స్వీకరించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతీ సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో పరిష్కార వేదికలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మండల, డివిజనల్ కార్యాలయాలతో పా టు ఆన్‌లైన్‌లో 1100కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయు తంగా వ్యవహరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ఒకసారి స్వీకరించిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిష్కరించి, అదే సమ స్యపై ఫిర్యాదులు మరలా రాకుండా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోషణ్ మాసోత్సవాలు

పెరవలి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, పిల్లలకు ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తుందని దానిని సద్వినియోగించుకోవాలని సర్పంచ్ మధు పూర్ణ చందు అన్నారు. కానూరు సెక్టార్ పరిధిలోగల కానూరు గ్రామంలో పోషణ్ మాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు ,పిల్లలకు అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, సొసైటీ ప్రెసిడెంట్ వాకలపూడి వీర్రాజు, ఎంపీటీసీ కోలా లక్ష్మి, సీతయ్య నాయుడు, బూరుగుపల్లి రాజు, ముళ్ళపూడి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



